క్లుప్తంగా

వేసవి చదువుల పంట



రాజోళి: మండల కేంద్రంలో సోమవారం వేసవి చదువుల పంట కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. విద్యాశాఖ, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు అందించి వారికి మెళకువలు అందించనున్నట్లు ఎంవీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డ్రాయింగ్, స్టోరీస్, ఆటలు తదితర మానసిక ఉల్లాసాన్ని కల్గించే తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, ఎంఈఓ భగీరథ రెడ్డి, బుజ్జమ్మ, ఎంపీడీఓ ఖాజీ మొయినుద్దీన్, దస్తగిరి, సంజీవరెడ్డి, నిషాక్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది



ధరూరు: పదోన్నతి అనేది బాధ్యతను మరింత పెంచుతుందని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఏఎస్‌ఐ వెంకట్రాములు ఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఆయనకు స్టార్స్ తొడిగి బాధ్యతలు గుర్తు చేశారు. అంకిత భావంతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీహరి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్: జాబుకార్డులు ఉన్న కూలీలందరూ ఉపాధి హమీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ సూచించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హమీ పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూలీలు పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో 100కు పైగానే కూలీలు పనులు చేసే విధంగా వారికి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో తగు జాగ్రత్తలు పాటించాలి

మల్దకల్: వేసవిలో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



రాజోళి: మండలంలోని పెద్దతాండ్రపాడులో పిడుగుల ధాటికి గ్రామానికి చెందిన హనుమంతు, మల్లేష్‌కు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. వేలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన గ్రాసం కాలిపోవడంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరుతున్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరమశివుగికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రయాణ ప్రాంగణంలో పాట్లు

- ఇరుకు భవనంలో ప్రయాణికుల ఇక్కట్లు
- కల్పించని మౌలిక వసతులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మౌలిక వసతులు లేని అయిజ ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

అయిజ: మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణ భవనం చిన్నదిగా ఉండటం, మౌలిక వసతుల లేమితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీటి వసతి కూడా లేని దుస్థితి నెలకొంది. కూర్చోవడానికి సరిపడా కుర్చీలు లేవు, ఈదురు గాలులకు ప్రయాణికులపై ఒలిపిరి పడుతుంది. వేసవిలో ఎండ తీవ్రతతో అల్లాడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. బస్టాండ్ నుంచి అధిక ఆదాయం సమకూరుతున్నా బస్టాండ్‌లో వసతులు కల్పించకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.

నిత్యం రద్దీగా

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల సరిహద్దుకు సమీపంలో ఉండడంతో మూడు రాష్ట్రాల ప్రయాణికులతో బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో రద్దీ మరింతగా పెరిగింది. దీంతో మరింతగా కష్టాలు మొదలయ్యాయి. బస్సులు వచ్చేంత వరకు ఎండలో ఉండాలి. లేదంటే వర్షంలో తుడువాలి. కనీసం తాగునీటి వసతి కూడా కల్పించకపోండంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



ఆరుబయట సిమెంట్ బెంచీలపై కూర్చున్న ప్రయాణికులు(ఫైల్)

ఆరుబయట కూర్చుంటున్న ప్రయాణికులు

ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో సరైనన్ని కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో దాతలు ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు, కూల్‌డ్రింక్స్ షాపుల అరుగుల మీద కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రాంగణంలో సీసీ బెడ్ ఏర్పాటు చేయకపోవడంతో గాలికి దుమ్ము, ధూళిలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఆర్టీసీ బస్టాండ్‌లో ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందిగా ఉంది. కనీసం ప్రయాణికులకు సరిపడినన్ని కుర్చీలు, బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. వృద్ధులు మెట్లపై కూర్చొని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి

– తిమ్మారెడ్డి, అయిజ

దాతలపై ఆధారపడాల్సి వస్తోంది



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆర్టీసీ సంస్థ కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదు. గత కొన్ని సంవత్సరాలనుంచి వేసవి కాలంలో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పేద ప్రజల దాహర్తి తీరుస్తున్నారు. ఈ ఏడాది ఇంతవరకు దాతలు కూడా తాగునీటి వసతి కల్పించలేదు.

– నాగరాజు, అయిజ

సమస్యలు పరిష్కరిస్తాం



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. షెల్టర్ బిల్డింగ్ పెద్దది నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. త్వరలో బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తాం.

– సునీత, ఆర్టీసీ డిపో మేనేజర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి



జింకలపల్లిలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రవల్లి: రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి రైతులు సద్వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, డీఎస్‌ఓ స్వామికుమార్, డీపీఎం రాంమూర్తి అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు, జింకలపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. రైతులు ఆరబోసిన వరి ధాన్యం తేమ శాతాన్ని మీటర్ ద్వారా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈదురు గాలులు, వర్ష సూచన ఉన్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా కేంద్రాల వద్ద తప్పకుండా టెంట్లు, తాగునీరు, మెడికల్ సిబ్బంది ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. 17 శాతం తేమ వచ్చేలా ఎండబెట్టి రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ.2,320 సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధరగా అందిస్తుందన్నారు. సన్న రకాలకు బోనస్‌గా మరో రూ.500 చెల్లిస్తుందన్నారు. ముఖ్యంగా వడ్లలో తాలు, రాళ్లు, మట్టి పెల్లలు లేకుండా తీసుకురావాలన్నారు. ఏఈఓ ద్వారా ముందుగా టోకెన్ తీసుకొని క్రమ పద్ధతిలో కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఏపీఎం కుర్మయ్య, ఏఈఓ ప్రవళ్లిక, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కొండేరులో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్‌ఓ స్వామికుమార్

రైతులను మోసం చేయడం తగదు



కొండేరులో రైతులతో ముచ్చటిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఎర్రవల్లి: ప్రభుత్వం రైతులను నిట్టనిలువునా మోసం చేస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మండిపడ్డారు. సోమవారం మండల పరిధిలోని కొండేరు శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించారు. కొనుగోలు కేంద్రంలో వారు పడుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి, కేవలం సన్న రకం వడ్లకు మాత్రమే బోనస్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. మొక్కజొన్న, జొన్న, కంది పంటలకు ఎలాంటి బోనస్ ఇవ్వకుండా ప్రభుత్వం ఆ పంటలు సాగు చేసిన రైతులను నిండా ముంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని తేమశాతం పేరిట కొనుగోలు చేయకుండా ఆపడం విడ్డూరంగా ఉందన్నారు. అకాల వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి మద్దతు ధరను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామంలో మంగళవారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, రైతు సంఘం సభ్యులు సోమవారం తెలిపారు. మే 1వ తేదీ గురువారం వరకు ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, నంది మాతృకాపూజ, మండపపూజ, నవగ్రహ వస్తు, అంకురార్పణ, సర్వతోభద్ర మండలదేవతాహ్వానం, బుధవారం ప్రాతఃకాలపూజ, దీక్షహోమం, శాంతిహోమం, నవగ్రహవాస్తు, మంగళహరతి, గురువారం ఉదయం 7.22నిమిషాలకు విగ్రహాలు, బొడ్రాయి, నవగ్రహ, ధ్వజస్తంభ, ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలని పేర్కొన్నారు.



వేడుకలకు ముస్తాబైన ఆలయం

చేనేత మహిళకు అవార్డు



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న పద్మ

రాజోళి: మండల కేంద్రం రాజోళికి చెందిన చేనేత మహిళ పద్మ రాష్ట్రస్థాయి స్త్రీశక్తి అవార్డు అందుకున్నారుర. రాజోళికి చెందిన పద్మ చేనేత కార్మికులు కాగా.. ఆమె స్వయం సహాయక సంఘాలు(మహిళా పొదుపు)లో రుణం తీసుకుని సొంతంగా చీరల వ్యాపారం చేస్తుంది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా స్త్రీశక్తి అవార్డు అందుకున్నారు. అవార్డు తీసుకోవడంపై పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

నేడు 'భూ భారతి'పై అవగాహన

అయిజ: భూ సంబంధిత వివాదాలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై మంగళవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిలుగా కలెక్టర్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓలు, ప్రజా ప్రతినిధులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. చట్టంపై రైతులకు సంపూర్ణంగా అవగాహన కల్పిస్తామని, రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్



గట్టు: మండల కేంద్రంలో సీసీ రోడ్డుపై మట్టిని తరలించే క్రమంలో విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొట్టిన ఘటన సోమవారం జరిగింది. రైతు భవనం నుంచి మసీదు వరకు బస్టాండ్‌లో కొత్తగా సీసీ రోడ్డు పనులు చేపట్టారు. సీసీ రోడ్డు క్యూరింగ్ కోసం మట్టిని తీసుకొస్తున్న టిప్పర్ విద్యుత్ స్తంభాని ఢీకొట్టడంతో స్తంభం ఓ పక్కకు ఒరిగింది. విద్యుత్ తీగలు తెగి కింద పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. సమాచారం తెలుసుకున్న విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపి వేసి, స్తంభాన్ని మార్చారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కేటీదొడ్డి: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువుల యజమానులను పరామర్శించారు. అదే విధంగా గాలులకు రాలిపోయిన మామిడి పంట, ధాన్యం కొనుగోలు సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, నాయకులు రామకృష్ణనాయుడు, రాజశేఖర్, ఉరుకుందు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపురంలో రాలిపోయిన మామిడి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మెరుగైన వైద్యం కోసం దోహదం

గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం క్యాంప్ క్యాంపు కార్యాలయంలో మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన శాంసన్‌కు మెరుగైన వైద్యం కోసం రూ.2.50లక్షలు, మల్దకల్ విఠలాపురం గ్రామానికి చెందిన పార్వతమ్మకు రూ.2.50లక్షల ఎల్‌ఓసీని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బండారీ భాస్కర్, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పంపిణీలో జోక్యం తగదు



ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు ఇస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నాయకుల జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదుల దినోత్సవంలో భాగంగా ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ప్రజాపాలన పేరిట 2024 జనవరిలో ఒకసారి, అదే సంవత్సరం చివరిలో రెండోసారి వార్డుల వారీగా సభలు నిర్వహించి తెల్లరేషన్‌కార్డులు ఉన్నవారితో ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవాటానికి రూ.5లక్షల ఇస్తామని దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అర్హులైన వారికి దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండల వెంకట్రాములు, అనిల్‌కుమార్, రజక నర్సింహులు, చిత్తారి కిరణ్, దేవదాసు, కృష్ణ, రమేష్, నర్సింహులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

అయిజ: మండల కేంద్రంలో గురుకుల పాఠశాలను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిలపక్షం కమిటీ నాయకులు సోమవారం తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో అయిజకు గురుకుల పాఠశాల మంజూరైందని, కొన్ని రోజులపాటు నిర్వహించి, బిల్డింగ్ వసతి లేకపోవడంతో ఎర్రవల్లి చౌరస్తాకు తరలించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాల తిరిగి అయిజలో ఏర్పాటు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకట్రాములు, వెంకటేశ్వరరావు, హనుమంతు, తిరుమల్ రెడ్డి, సుధాకర్‌గౌడ్, గోపాలకృష్ణ, లక్ష్మణ్‌గౌడ్, యేసురాజు, కిష్టన్న, విజయ్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం కమిటీ నాయకులు

ఈదమ్మ ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఈదమ్మ అమ్మవారి ఆలయం

- నేటి నుంచి ప్రారంభం
- అంతర్రాష్ట్ర పోటీలు నిర్వహణ



ఈదమ్మ అమ్మవారు

అలంపూర్: మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో వెలిసిన ఈదమ్మ అమ్మవారి దేవర ఉత్సవాలు ఈనెల 29న మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఏడాది ఈదమ్మ అమ్మవారి దేవర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు పేర్కొన్నారు. దేవరను పురస్కరించుకొని గ్రామంలో అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు, పురుషుల కబడ్డీ పోటీలు, ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు ఈనెల 29, 30 తేదీ ఉదయం 8.30 గంటలకు రెండు రోజులపాటు జరుగనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.8 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 30న ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, అంతర్రాష్ట్ర వృషభాల న్యూ క్యాటగిరీ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం

ధరూరు: 139వ మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో మండల నాయకులతో కలిసి మేడే కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని విస్మరించడం శోచనీయమన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రజా సంపదను కట్టబెట్టేందుకు కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చిందన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం నాయకులు అశోక్, వెంకటేష్, జమ్మన్న, రాజు, వీరేష్, బందయ్య, వీరేష, మలయ్య, తాయప్ప, శ్రీను, సుధాకర్, గోవిందు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ధర్మప్రచార సమితి సభ్యులకు శిక్షణ కార్యక్రమం

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో వచ్చే నెల 4, 5వ తేదీల్లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార సమితి కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మప్రచార సమితి జిల్లా ప్రముఖ్ సత్యం రామానుజ దాసః సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేది సాయంత్రం 4గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం 4గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలతో పాటు గ్రామ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తమ వెంట నిత్యావసర వస్తువులు తప్పకుండా తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

భగీరథ పైపులైన్ లీకేజీ

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్ వెళ్లే మార్గంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ డ్రిప్ ఎయిర్ లాక్ కావడంతో నీరు అమాంతం ఎగిసిపడ్డాయి. పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతుండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

